ఫీజు ఇవ్వలేదని కుట్లు తొలగింపు

కామారెడ్డిలో ప్రైవేట్ దవాఖాన పైశాచికం

కామారెడ్డి, సెప్టెంబర్ 22: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడికి కుట్లు వేసినందుకు ఫీజు చెల్లించకపోవడంతో.. వేసిన కుట్లను తొలగించారు ఓ ప్రైవేట్ దవాఖాన సిబ్బంది. ఈ అమానవీయ ఘటన కామారెడ్డి కేంద్రంలో ఆదివారం చోటుచేసున్నది. పట్టణానికి చెందిన శ్రీను అనే యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. రక్తస్రావం కావడంతో స్థానిక ప్రైవేట్ దవాఖానకు వెళ్లి, డాక్టర్ (కన్సల్టేషన్) ఫీజు రూ. 300 చెల్లించి చూపించుకున్నాడు. ప్రమాదంలో తగిలిన గాయాలకు దవాఖాన సిబ్బంది కుట్లు వేశారు. అయితే కుట్లు వేసినందున డబ్బులు అడిగారు. తన వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా ఫీజు తీసుకోవాలని చెప్పడంతో దవాఖాన సిబ్బంది నిరాకరించారు. అంతటితో ఆగకుండా సిబ్బంది యువకుడితోపాటు వెంట ఉన్న స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. దీంతో యువకుడి బంధువులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. చివరికి దవాఖాన సిబ్బంది యువకుడికి వేసిన కుట్లను విప్పేసి పంపించి వారిలోని పైశాచికత్వాన్ని చాటుకున్నారు. అనంతరం సదరు యువకుడిని స్నేహితులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.

విద్యాశాఖకు కొత్తబాస్‌లు

- ఇది వరకు ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో నిర్ణయాలు
- ఇప్పుడేమో క్యాబినెట్ సబ్‌కమిటీ.. విద్యాకమిషన్‌లు

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఇప్పుడు విద్యాశాఖకు కొత్తబాస్‌లొచ్చారు. కొత్తగా వచ్చారంటే బదిలీపై వచ్చారని కాదు.. వారు వచ్చింది విద్యాశాఖ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే విషయంలో. ఇంతకు ఎవరంటే వారు... ముగ్గురు మంత్రుల నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ ఒకటి కాగా, విద్యా కమిషన్ మరోటి. ప్రభుత్వ స్థాయిలో ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవాలంటే ఇదివరకు అధికారులు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపించేవారు. వాటిని విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలనకు పంపించేవారు. ఇవి ఆమోదం పొందడమో.. లేక తిరస్కరణకు గురవడమో జరిగేవి. కానిప్పుడు కొత్తగా విద్యాసంస్కరణలపై ముగ్గురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇటీవలే విద్యా కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో విద్యాశాఖకు కొత్త బాస్‌లొచ్చినట్లైంది. ఇక నుంచి ఎలాంటి కొత్త నిర్ణయాలు తీసుకోవాలన్నా.. ఈ రెండింటి పరిశీలనకు పంపాల్సి ఉంది. వీటి ఆమోదం తీసుకున్న తర్వాతే అవి కార్యరూపందాల్చుతాయి. ఇలా కొత్త బాస్‌లు, రెండు, మూడు అంచెల్లో చర్చించి నిర్ణయాలు తీసుకోవడంతో పలు కీలక నిర్ణయాలు ఆలస్యమయ్యే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎంప్లాయిస్ జేఏసీలో 205 సంఘాలు

- రేపు జేఏసీ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఏర్పడిన తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీలో 205 సంఘాలు భాగస్వామ్యమయ్యాయి. ఉమ్మడి ఏపీలో 117 సంఘాలు ఉండగా, తాజాగా 205 సంఘాలు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీలో చేరినట్టు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గ సమావేశాన్ని 24న బాగ్‌లింగంపల్లిలోని సుందయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సన్మాన సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారమే జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటుచేస్తామని, అనంతరం జిల్లా జేఏసీలు ఏర్పాటవుతాయని తెలిపారు.

ఇరాన్ బొగ్గు గనిలో భారీ పేలుడు

51మంది కార్మికులు మృతి

టెహరాన్, సెప్టెంబర్ 22: ఇరాన్‌లోని ఓ బొగ్గు గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం రాత్రి దక్షిణ ఖోర్సాన్ ప్రావిన్స్‌లోని బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించి, 51మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆ దేశ ప్రభుత్వ మీడియా ఆదివారం తెలిపింది. మడాంజూ అనే కంపెనీ ఆధ్వర్యంలోని బొగ్గు గని బీ, సీ బ్లాకుల్లో మీథేన్ వాయువు లీకై, పేలుడు సంభవించిందని, గని లోపల శిథిలాల కింద 24 మంది చిక్కుకుపోయారని తెలిసింది. గనిలో మొత్తం 69మంది కార్మికులు పనిచేస్తున్నారని స్థానిక మీడియా పేర్కొన్నది.

దామగుండం అడవిని రక్షించుకుందాం

- 12 లక్షల చెట్ల నరికివేతతో అటవీ విధ్వంసం
- అడవిని పెంచాకే రాడార్ కేంద్రం పెట్టుకోవాలి
- నాడు బీఆర్ఎస్ వ్యతిరేకిస్తే.. కాంగ్రెస్ అనుమతి
- ఢిల్లీ దాకా పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం
- సేవ్ దామగుండం జేఏసీ ధర్నాలో వక్తల పిలుపు



ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 22: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పరిధిలోని దామగుండం అడవిని పరిరక్షించుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆ అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు పేరుతో 12 లక్షల చెట్ల నరికివేత నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. సేవ్ దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, పౌరసంఘాల, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ఉద్యోగ, న్యాయ, కార్మిక, సామాజిక మహిళా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో చెరువులను కుంటాలను కాపాడుతున్నామని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన సొంత జిల్లాలోనే ఇంత విధ్వంసం జరుగుతుంటే పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. దామగుండం అడవిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. పర్యావరణాన్ని, అభివృద్ధిని బ్యాలెన్స్ చేయకపోతే వయనాడ్, ఉత్తరాఖండ్ వంటి ప్రకృతి విలయాలు చూడాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి పర్యావరణ నష్టం రిపోర్టు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మొట్టమొదట 12 లక్షల మొక్కలు నాటి అది అడవైన తర్వాతే నేవీ రాడార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని సూచించారు. అడవినే ఒక ఆస్తిగా చూడాలని ప్రముఖ పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ కోరారు. 1956లో తెలంగాణలో ఆంధ్ర రాష్ట్రం కలిసిన తర్వాతే ప్రకృతి విధ్వంసం మొదలైందని, ఇది భవిష్యత్తు తరాల సమస్య అని చెప్పారు. హైదరాబాద్ వాసులు మాస్కులు పెట్టుకొని బతికే పరిస్థితులను రానీయొద్దని దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కోరారు.

తెలంగాణ ఊటీని కాపాడుకుందాం: మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్

తెలంగాణ ఊటీ అయిన దామగుండాన్ని కాపాడుకుందామని, దానికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ పరిగి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్ తెలిపారు. రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం 2018లో కేంద్ర ముందుకొస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపిందని చెప్పారు. కానీ రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే దాని ఏర్పాటుకు సంతకం పెట్టిందని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. 12 లక్షల చెట్లను నరకడం దుర్మార్గమని, అడివిని రక్షించే దిశగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇక్కడితో అపపకుండా ఢిల్లీ వరకు ఉద్యమాన్ని తీసుకువెళ్లాలని దామగుండం జేఏసీ ఈ సందర్భంగా తీర్మానించింది. కార్యక్రమంలో దామగుండం జేఏసీ కోఆర్డినేటర్లు రామన్న మాదిగ, జర్నలిస్టులు తులసీ చందు, గీత, సిరాజ్, దామగుండం రామలింగేశ్వర ఆలయ పూజారి సత్యానంద స్వామి, సంధ్య, విమలక్క, దామగుండం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదలో చిక్కుకున్న పశువుల కాపరులను పొక్లెయినర్ సహాయంతో కాపాడిన పోలీసులు

మూసీలో చిక్కుకున్న పశువుల కాపరులు

ఇద్దరిని కాపాడిన పోలీసులు • హెచ్చరికలు లేకుండానే గేట్లు ఎత్తిన అధికారులు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం పశువుల కాపరుల ప్రాణాల మీదకు తెచ్చింది. ముందస్తు హెచ్చరికలు లేకుండా అధికారులు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతంలో ఉన్న పశువుల కాపరులు వరదలో చిక్కుకుపోయారు. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో మూసీ ప్రాజెక్టు అధికారులు ఆదివారం మధ్యాహ్నం కేవలం సైరన్ మోగించి మూడు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఇది తెలియని మూసీ పరీవాహక ప్రాంతంలోని గ్రామాల పశువుల కాపరులు మేతకు, ఇసుక వ్యాపారులు వాగులో ఇసుక తీసేందుకు వెళ్లారు. గేట్లు ఎత్తడంతో ఒక్కసారిగా వచ్చిన వరద వారిని చుట్టుముట్టింది. కేతపల్లి మండలం భీమారం వద్ద దిగువ ప్రాంతంలో ఒక్కసారిగా నీరు చేరడంతో మధ్యలో పశువుల కాపరులు గంగయ్య, బాలయ్య చిక్కుకుపోయారు. వాగు మధ్యలో ఉన్న పెద్ద బండ రాయిని ఎక్కి సహాయం కోసం ఆర్తనాదాలు చేశారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మూడు గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి పశువుల కాపరులను పొక్లెయినర్ సాయంతో బయటకు తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే 20 బర్రెలతో పాటు ట్రాక్టర్ వరదలో కొట్టుకుపోయినట్టు సమాచారం.

తిమ్మాయిపల్లి చెరువులోకి ట్యూబ్‌పై వెళ్తున్న వాటర్‌మెన్ కురుమయ్య

చెరువు మధ్యలో బోరుకు మరమ్మతులు

- ట్యూబ్‌పై నీటిలోకి వెళ్లి పనులు
- వాటర్‌మెన్ చొరవకు ప్రశంసలు

మూసాపేట(అడ్డాకుల), సెప్టెంబర్ 22 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లిలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వెంటనే స్పందించిన వాటర్‌మెన్ పెద్ద కురుమయ్య ఆదివారం లారీ ట్యూబ్‌పై చెరువు మధ్యలోకి వెళ్లి బోరు మోటర్‌కు విద్యుత్ సరఫరా అందించారు. అలాగే బోరుకు మరమ్మతు చేసి వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా ప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

1.93 లక్షల చెట్లే తొలగింపు

- దామగుండం అడవుల్లో తొలగించే సంఖ్య ఇదే
- 12 లక్షల చెట్ల తొలగింపు అంటూ అసత్య ప్రచారం
- రాడార్ ఏర్పాటుతో కోల్పోయే చెట్లను పునరుద్ధరిస్తాం
- తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్‌ను నెలకొల్పేందుకు 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటీ 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలిగిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాడార్ ఏర్పాటుకోసం 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తలు నిరాధారమైనవనీ, అసంబద్ధమైవని చెప్పారు. రాడార్ ప్రాజెక్టు నిర్మాణ కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48 శాతం విస్తీర్ణం మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగిస్తారని, మిగతా 52 శాతం విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హానీ జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి ఉన్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనున్నదని డోబ్రియాల్ తెలిపారు. ఈ ప్రాంతంలో 500 ఏండ్లుగా కొలువై ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా తరలిస్తున్నారనే వాదననూ డోబ్రియాల్ ఖండించారు. ఈ ప్రాంతంలో 32 ఎకరాల 10 గుంటల్లో విస్తరించిన ఈ ఆలయంతోపాటు, అనుబంధంగా ఉన్న కొలను అలాగే కొనసాగుతాయని, ఆలయాన్ని సందర్శించే భక్తులకు నేవీ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

'రాడార్ స్టేషన్'తో పెనుముప్పు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తేతెలంగాణ) : వికారాబాద్ జిల్లా దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంతో పర్యావరణానికి పెనుముప్పు కలుగనున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ ప్రాంతంలోని 3 వేల ఎకరాల్లో రాడార్ స్టేషన్ నిర్మిస్తే.. లక్షలాది వృక్షాలు, వన్యప్రాణులకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచిఉందని ఆవేదన వ్యక్తంచేశారు. వేరేచోట నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ చెరువుకు పడిన గండి

బూరుగడ్డ చెరువుకు మళ్లీ గండి

నిలిచిన రాకపోకలు

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 22: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామ నల్లచెరువుకు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ గండిపడింది. గత నెల 24న కురిసిన వర్షాలతో వరద ప్రవాహానికి నల్లచెరువుకు గండి పడటంతో గోపాలపురం- బూరుగడ్డ గ్రామాల మధ్యగల రోడ్డు కొట్టుపోయింది. దాంతో పదిరోజులపాటు రాకపోకలు నిలిచిపోయి సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో ఆ తర్వాత అధికారులు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. కాగా శనివారం కురిసిన వర్షపు నీటితోపాటు నాగార్జునసాగర్ జలాలు వచ్చి చేరడంతో వరద పెరిగింది. కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో జేసీబీతో కొంత భాగాన్ని తొలగించి గండి పెట్టి నీటిని దిగువకు వదిలారు. గండి పెరిగి కర్కకాయలగూడెం, మాచవరం, బూరుగడ్డ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. త్వరగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పీఆర్సీ మరింత ఆలస్యం!

- ఈ నెలాఖరుతో ముగియనున్న కమిటీ గడువు
- మరో 3 నెలలు పొడిగించే అవకాశం
- జాప్యంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల గుర్రు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వేతన సవరణకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నది. తాజా సమాచారం ప్రకారం పీఆర్సీ నివేదిక సమర్పణకే మరో మూడు నుంచి ఆరు నెలల సమయం పట్టనున్నది. ఇప్పటికే పీఆర్సీ జాప్యంతో సర్కారుపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. కమిటీ గడువును పొడిగించే అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఉద్యోగుల వేతన సవరణ సిఫారసులకు 2023 అక్టోబర్ 2న గత కేసీఆర్ ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ 6 నెలల్లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ గడువు ఈ ఏడాది ఏప్రిల్ 2తో ముగియాల్సి ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో కమిటీ గడువును మరో ఆరు నెలలు పొడిగించగా ఈ నెలాఖరుతో ముగియనున్నది. పీఆర్సీ కమిటీ తొలుత ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నుంచి ఆ తర్వాత ప్రభుత్వ శాఖలతో సంప్రదింపులు చేపట్టింది. ఒక్క ఆర్థికశాఖతో మాత్రమే సంప్రదింపులు జరపాల్సి ఉన్నది. ఆ తర్వాత ఫిట్‌మెంట్ సహా పలు అంశాలపై ప్రభుత్వ వైఖరిని తెలుసుకొని కమిటీ పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తుంది. దీనికోసమే ఇంకొంత కాలం పడుతుంది. తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కోరుతున్నాయి.

గురుకులాల నిర్వహణకు కామన్ డైరెక్టరేట్

టీజీపీఏ అధ్యక్షుడు అజయ్‌కుమార్ సూచన • మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక

మాట్లాడుతున్న గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీల నిర్వహణ కోసం కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ సూచించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీజీపీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గురుకులాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. గురుకుల సొసైటీలలో ఏకరూప పనివేళలు, పనివిధానం అమలుచేయాలని అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మల జితేందర్, ప్రధాన కార్యదర్శిగా రంగు స్వప్న, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాసులు, కోశాధికారి వస్కుల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, కార్యదర్శిగా జహిరున్నీసా, సంయుక్త కార్యదర్శి రమేశ్, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా సుధారాణి, సెక్రటరీ మోనికా సోని, సలహాదారులుగా చందర్‌రెడ్డి, కల్పన, అధికార ప్రతినిధిగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. టీజీపీఏ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాంబాబు, కోశాధికారి రాజేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల ప్రకాశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ భిక్షపతి, నీరజ తిరుపతి పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించకపోతే స్థిరాస్తి జప్తు

అక్రమంగా పట్టా చేసుకుంటే కేసు నమోదు • ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర వెల్లడి

కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్ 22: వివాహం అనంతరం కుమారులు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే స్థిరాస్తులను జప్తు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వంగా ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకొని వ్యవసాయం చేస్తున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన మామిడిశెట్టి చిన్న మల్లయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా, మల్లయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమిని కొడుకులు అక్రమంగా పట్టా చేసుకొని తల్లిందండ్రులను పట్టించుకోలేదు. దీంతో తండ్రి మల్లయ్య రెవెన్యూ అధికారులను సంప్రదించారు. భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నట్టు అధికారుల విచారణలో తేలడం తో 1977 చట్టం ప్రకారం భూమి తిరిగి మల్లయ్యకు చెందేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీంతోపాటు 2007 సీనియర్ పౌరుల పోషణ చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోషణ భారం తీసుకోవాలని అతని కుమారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

మొదటి బహుమతి పొందిన కోటేశ్వర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

రెండో బహుమతి పొందిన ఉమాదేవికి మెమెంటో అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి

- స్వదేశం కంటే విదేశాల్లోనే పండుగలకు పట్టం
- గ్రంథాలయాలు విద్యార్థుల ప్రగతికి సోపానాలు
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి
- 'నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' జాతీయ స్థాయి కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 22: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆకాంక్షించారు. 'నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి 2023-24 కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు పండుగలను మన ప్రాంతంలోకంటే విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థుల ప్రగతికి సోపానాలుగా నిలుస్తాయని చెప్పారు. ఇక్కడ చదువుకుని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వేముల శ్రీనివాసులు ముల్కనూరు ప్రజాగ్రంథాలయానికి చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, అల్గిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దుగ్గిరాల వెంకట్రావు, శ్రీరంగారావు, వొడితెల రాజేశ్వర్ రావు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు పార్టీలకతీతంగా పనిచేశారని కొనియాడారు. ముల్కనూరులో ప్రజాగ్రంథాలయం స్థాపించి పదేండ్లు పూర్తికావడం అభినందనీయమని అన్నారు. అమెరికా వంటి దేశాల్లో పిల్లలకు తెలుగునేర్పించడం కోసం ప్రత్యేకంగా టీచర్లను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్నేహితుల సహాయంతో తాము స్థాపించిన ముల్కనూరు ప్రజాగ్రంథాలయం పలువురు విద్యార్థుల విజయానికి దోహదపడటం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకుని ఇప్పటి వరకు 30 మంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. అంతకుముందు కోడూరి రాజయ్య స్మారకార్థం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. చివరలో కథలపోటీల విజేతలకు ఆహుతుల చేతులమీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బతుకమ్మ ఫీచర్స్ ఇంచార్జి టీ నాగరాజు, ఇప్పూ ప్రొఫెసర్ తిరుమతి కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, మాజీ జడ్పీటీసీ వంగరవి, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, మాజీ సర్పంచులు గూడెల్లి రాజిరెడ్డి, మాడుగుల కొమరయ్య, గ్రంథాలయ నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, తాళ్ల వీరేశం, పల్లా ప్రమోద్ రెడ్డి, అయిత కిషన్‌ప్రసాద్, మూల శ్రీనివాస్, కోగూరి సుగుణాకర్, కరుణాకర్, మూల